batukammanews.com

TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

6 ఆగస్టు 2026
గురువారం

## విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

**షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసిన ఏసీబీ కోర్టు**

హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదిత విదేశీ పర్యటనకు ఏసీబీ కోర్టు షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), అమెరికా (యూఎస్), జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతి కోరుతూ సీఎం కోర్టును ఆశ్రయించారు.

02



### తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంచడానికి

# మహారాష్ట్ర అనుమతులు ఇప్పించాలి

**కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి**



వెబ్ డెస్క్, బతుకమ్మ :ప్రాణహిత నదిపై నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో బుధవారం ముఖ్యమంత్రి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను సీఎం వివరించారు. ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జలశక్తి శాఖకు పంపిన విషయాన్ని ప్రస్తావించారు.

తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిందని సీఎం గుర్తుచేశారు. అయితే బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు పెంచే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనం నిర్వహించిందని తెలిపారు. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా ఉండదని తేలిందని సీఎం పేర్కొన్నారు. ముంపులో సుమారు 50 శాతం నదీ గర్భంలోనే ఉంటుందని వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యం కాదని, దీంతో విద్యుత్ వినియోగ భారం పెరుగుతుందని సీఎం తెలిపారు. అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమవుతుందని, దీని వల్ల విద్యుత్ ఖర్చు తగ్గుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ అంశంపై తెలంగాణ, మహారాష్ట్రల మధ్య త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. ముందుగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. అనంతరం ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### పెరుగుతున్న రద్దీ కోసమే

## సైదాబాద్, మూసారాంబాగ్ ప్రాజెక్టులు

**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**



02

హైదరాబాద్, బతుకమ్మ :నగరంలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగానే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, మూసారాంబాగ్ ప్రాజెక్టులను చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో కీలక మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, మూసారాంబాగ్ వంతెన పనులను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న మంత్రులు, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రూ.680 కోట్ల వ్యయంతో నిర్మించిన సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని త్వరలోనే ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే నగరంలోని ప్రయాణికులకు మరింత సౌకర్యం కలుగుతుందని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఇది దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. మూసారాంబాగ్ వంతెనను కూడా త్వరలోనే ప్రారంభించి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.

### ఆషాడ మాసంలో అమ్మవారికి

# బోనాలు సమర్పించడం ఆనవాయితీ



02

**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ప్రతి ఆషాడ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పాత కలెక్టరేట్ ప్రాంగణంలో టీఎన్జీవోల ఆధ్వర్యంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు.

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

### హైదరాబాద్ ప్రైవేట్ కాలేజీల దుశ్చర్య

### ఎన్ఓసిల కోసం బరి తెగించిన కాలేజ్‌లపై కేసులు

హైదరాబాద్, బతుకమ్మ :హైదరాబాద్‌లో ప్రైవేటు జూనియర్ కళాశాలలకు సంబంధించిన భారీ ఫోర్జరీ వ్యవహారం వెలుగులోకి రావడంతో విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని నకిలీగా సృష్టించి, తప్పుడు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌వోసీలు) సమర్పించినట్లు గుర్తించిన అధికారులు సంబంధిత ఎనిమిది జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలకు సిద్ధమయ్యారు.

02





# ఆషాడ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో సందడి చేశారు. అనంతరం టీఎన్జీవోస్ ప్రతినిధులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, దయాకర్ గౌడ్, టీఎన్జీవోస్ అధ్యక్షులు సుమన్ కుమార్, కార్యదర్శి శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీఎస్బీఓఎస్ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

అధికారుల సమాచారం ప్రకారం, హైడ్రా నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు పొందకుండా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీ సర్టిఫికెట్లు రూపొందించారు. అనంతరం ఆ పత్రాలను ఇంటర్మీడియట్ బోర్డుకు అఫిలియేషన్ కోసం దరఖాస్తులతో పాటు సమర్పించినట్లు తేలింది. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా హైడ్రా అధికారులతో కలిసి పత్రాలను ధృవీకరించగా, సర్టిఫికెట్లు పూర్తిగా నకిలీవని బయటపడింది. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన హైడ్రా అధికారులు ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కేసులో మెహిదీపట్నంలోని ప్రియాంక జూనియర్ కాలేజ్, విద్యానగర్‌లోని మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్టలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చిక్కడపల్లిలోని న్యూ ఎరా జూనియర్ కాలేజ్, శివరాంపల్లిలోని షాహీర్ జూనియర్ కాలేజ్, తెల్లాపూర్‌లోని వశిష్ట జూనియర్ కాలేజ్, బర్కత్‌పురలోని హైందవి జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్‌లోని రెసిడెన్స్ జూనియర్ కాలేజ్ పేర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఇదే తరహాలో సమర్పించిన మరో 60 కళాశాలల ఎన్‌వోసీలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. విచారణ పూర్తయ్యే వరకు మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# విద్యాభివృద్ధిని ప్రోత్సహించడమే లక్ష్యం


## జిల్లా వంజరి సంఘం అధ్యక్షులు మాస్టర్ శంకర్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :వంజరి విద్యార్థుల్లో విద్యాభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో 2025 - 26 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ (10వ తరగతి) పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా వంజరి సంఘం అధ్యక్షులు మాస్టర్ శంకర్ ప్రకటించారు. హమాలీవాడీలోని జిల్లా వంజరి సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాకు చెందిన వంజరి కుల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బహుమతులకు అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులతో పాటు 10వ తరగతి మార్కుల మెమో, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను జిల్లా వంజరి సంఘం కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను ప్రతిరోజు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, అలాగే సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు స్వీకరిస్తామని తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆగస్టు 15, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మామిడిపల్లిలోని వంజరి సంఘం కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు మాస్టర్ శంకర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా వంజరి సంఘం కోశాధికారి కరిపే మధుసూదన్, కార్యదర్శి గోపాల్ శ్రీధర్, కరిపే గణేష్, నవతే సతీష్, గంగోనే సతీష్, తుదిగేన రాజేష్, అమంద్ విజయ్ కృష్ణ, సితేవార్ రవి తదితరులు పాల్గొన్నారు.



### విదేశీ పర్యటనకు

# సీఎం రేవంత్ రెడ్డి



CrlM.P.No.287 and 288 of 2026 in C.C No.15/2016 - 1 - PSJ/ACB, Hyd.

**IN THE COURT OF THE PRINCIPAL SPECIAL JUDGE FOR TRIAL OF SPE & ACB CASES: HYDERABAD**

PRESENT: KUMAR VIVEK,
District & Sessions Judge,
Hyderabad.

Monday, this the 3rd day of August, 2026.

**Crl.M.P. Nos. 287 & 288 of 2026**
**in**
**C.C.No. 15 of 2016**

**Between:**

A. Revanth Reddy
....Petitioner/Accused No.1

&

The State of Telangana through
Additional Superintendent of Police,
Anti Corruption Bureau, CIU, Hyderabad.
....Respondent/Complainant

*These petitions have come before me on 27.07.2026 for hearing in the presence of Sri Kumar Vaibhav, Advocate for the petitioner/accused no.1, and the Special Public Prosecutor for the respondent/complainant, and upon perusal of the material papers available on record and the matter having heard, read over and stood to till this day for consideration, this Court delivered the following:*

**:: COMMON ORDER ::**

1. These are petitions filed under sections 451 and 437(3) of the Criminal Procedure Code for granting interim custody of the passports bearing nos. D1142430, D1116308, B5174250 and Z1866937 of the petitioner/accused no.1 from 23.07.2026 to till 23.10.2026, and also to permit the petitioner/accused no.1 to travel to United Kingdom, United States of America, Germany and China from 17.08.2026 to 10.09.2026 (excluding travel time).

ఓటుకు నోటు కేసులో జప్తు చేసిన తన పాస్‌పోర్టును తాత్కాలికంగా విడుదల చేయాలని, అలాగే బెయిల్ నిబంధనలను సడలించాలని రేవంత్ రెడ్డి కోర్టును కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు పలు షరతులతో అనుమతి మంజూరు చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం, రేవంత్ రెడ్డి రూ.1 లక్ష విలువైన ష్యూరిటీ సమర్పించాలి. అలాగే విదేశాల్లో బస చేసే చిరునామా, సంప్రదింపు వివరాలను కోర్టుకు అందజేయాలని సూచించింది. విదేశీ పర్యటన ముగిసిన అనంతరం సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టును తిరిగి కోర్టుకు అప్పగిస్తానని అఫిడవిట్ సమర్పించాలని కూడా ఆదేశించింది. ఈ షరతులను పాటిస్తూ రేవంత్ రెడ్డి తన విదేశీ పర్యటనను కొనసాగించేందుకు ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

### పెరుగుతున్న రద్దీ కోసమే

# సైదాబాద్, మూసారాంబాగ్ ప్రాజెక్టులు

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా ఫ్లైఓవర్లు, వంతెనలను నిర్మిస్తోందని మంత్రి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఈ ప్రాజెక్టులు ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రయాణ సమయాన్ని ఆదా చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉండాలంటే ఆయుర్వేద ప్రకారం ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలి..?

ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాదు, ఆ ఆహారం శరీరంలో సరిగ్గా జీర్ణమై పోషకాలుగా మారడం కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేదం చెబుతోంది. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వైద్య విధానం ప్రకారం ప్రతి వ్యక్తి శరీర తత్వం భిన్నంగా ఉంటుంది. అందువల్ల అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని, వ్యక్తిగత శరీర స్వభావానికి అనుగుణంగా ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తోంది. ఆయుర్వేదం ప్రకారం మంచి ఆరోగ్యానికి మూలం బలమైన జీర్ణవ్యవస్థ. ఆహారం సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందించినప్పుడు జీవక్రియలు సమతుల్యంగా పనిచేస్తాయి. వ్యక్తి శారీరక అవసరాలకు అనుగుణంగా తీసుకునే ఆహారం ఔషధంలా పనిచేసి జీవక్రియలను సమతుల్యం చేయడంతోపాటు శరీరానికి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని అందిస్తుందని ఆయుర్వేదం పేర్కొంటోంది.

### మూడు ప్రధాన దోషాలు..

మనిషి ప్రకృతిలో భాగమేనని భావించే ఆయుర్వేదం శరీరాన్ని మూడు ప్రధాన దోషాల ఆధారంగా వివరిస్తుంది. అవే వాత, పిత్త, కఫ. ఈ మూడు శక్తులు ప్రతి వ్యక్తిలో వేర్వేరు నిష్పత్తుల్లో ఉంటాయని, వాటి ఆధారంగానే ఆహార అవసరాలు కూడా మారుతాయని చెబుఓంది. అందుకే ఒకరికి అనుకూలమైన ఆహారం మరొకరికి తప్పనిసరిగా సరిపోవాల్సిన అవసరం లేదని వివరిస్తోంది. వాత దోషం అధికంగా ఉన్నవారికి ఉడికించిన ధాన్యాలు, వెన్న, పాల పదార్థాలు, గింజలు, ఉడికించిన కూరగాయలు అనుకూలంగా ఉంటాయి. అయితే పచ్చి సలాడ్లు, ఎక్కువ పండ్లు, బీన్స్ వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవడం మంచిది. పిత్త దోషం ఎక్కువగా ఉన్నవారికి పచ్చి సలాడ్లు, ఉడికించిన ధాన్యాలు, పాలు, విత్తనాలు అనుకూలమైన ఆహారాలు కాగా ఎక్కువ కారం, వేడి పదార్థాలు, పులుపు ఎక్కువగా ఉన్న ఆహారాలు, డీప్ ఫ్రై చేసిన వంటకాలు, పెరుగు, వెనిగర్ వంటి పులియబెట్టిన పదార్థాలను తగ్గించాలి.

### కఫ దోషం ఉంటే..

కఫ దోషం అధికంగా ఉన్నవారు సలాడ్లు, ఉడికించిన కూరగాయలు, మసాలా ఆహారం, క్వినోవా, మిల్లెట్స్, మొక్కజొన్న పిండి, బక్‌వీట్ వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. పాల పదార్థాలు, మాంసాహారం, చీజ్, గింజలు, గోధుమలు, బియ్యం వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. ఆయుర్వేదం సూచించే సాధారణ ఆహార నియమాల్లో తాజా ఆహారానికి మొదటి ప్రాధాన్యం ఉంటుంది. సీజన్‌కు అనుగుణంగా స్థానికంగా పండిన తాజా ఆహారాల్లోనే అధిక పోషకాలు లభిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాల కంటే సహజమైన సంపూర్ణ ధాన్యాలు, సంపూర్ణ పండ్లు, కాలానుగుణ కూరగాయలను ఎక్కువగా తీసుకోవడం మంచిది.

### సేంద్రీయ ఆహారాలు మంచివి..

సాధ్యమైనంత వరకు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని ఎంచుకోవడం వల్ల మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చు. ప్రతి భోజనంలో ఆరు రుచులు ఉండేలా చూసుకోవాలి. తీపి, పులుపు, ఉప్పు, చేదు, కారం, వగరు అనే ఆరు రుచులు సమతుల్యంగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందడమే కాకుండా భోజనం చేసిన తర్వాత సంతృప్తి కలుగుతుంది. మధ్య మధ్యలో చిరుతిళ్లు తినే అలవాటు, అతిగా తినడం తగ్గే అవకాశం ఉంటుంది. పండ్లు, కూరగాయలకు రోజువారీ ఆహారంలో ప్రత్యేక స్థానం ఇవ్వాలి. నీలం, ఊదా, ఎరుపు, ఆకుపచ్చ, నారింజ రంగుల పండ్లు, కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా శరీరాన్ని సహజంగా శుభ్రపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని ఆయుర్వేదం తెలియజేస్తోంది.

# ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

## యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతి మధ్య భాగం (మీడియా టినం), డయాఫ్రేమ్, ఛాతీ గోడకు వచ్చే వ్యాదులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విదానాలను ఉపయోగిస్తోందని యశోద హాస్పిటల్స్ దొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసి సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాదులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వ్యాదిని త్వరగా గుర్తించడం వల్ల పేషంట్ల కు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందన్నారు. దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లబించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నారన్నారు. థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, చాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్, కొన్ని క్లిష్టమైన సమస్యలకు చాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు. వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ (వాట్స్), రోబోట్ సహాయంతో చేసే సర్జరీ (రాట్స్) వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. వీటి వల్ల పేషంట్లకు సర్జరీ కోత, నొప్పి చాలా తక్కువగా ఉంటాయని, ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. పేషేంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు. డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతున్నారన్నారు. గత పదేళ్లలో చాతీ సర్జరీల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఈ రోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నామన్నారు. దీని వల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నామని చెప్పారు. "వ్యాధిని ముందుగానే గుర్తించడం ఆధునిక సర్జరీ నైపుణ్యాలు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్ కు వైద్యం చేయడం వల్ల పేషేంట్లకు అత్యుత్తమ చికిత్స అందుతోందన్నారు. వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారన్నారు. ప్రతి పేషంట్ కు వారి ఆరోగ్యపరిస్థితికి తగ్గట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనే ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యమని ఆయన వివరించారు. అధునాతన ఆపరేషన్ థియేటర్లు, హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, రోబోటిక్ సర్జికల్ ప్లాట్ఫారమీలు, థొరాసిక్ సర్జన్లు, పల్మోనాలజిస్టు, ఆంకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్థీషియాలజిస్టలు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లేనరీ బృందం మద్దతుతో, యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ (చాతి) సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోందన్నారు. ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు, అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతి కణితులు సంక్లిష్టమైన దాతీ ఎమర్జెన్సీల వరకు, హాస్పిటల్ ఎవిడెన్స్- బేస్, మినిమల్లీ నాసిస్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోందన్నారు . పేషింట్లు మెరుగైన భద్రత సౌకర్యంతో మంచి పలితాలను సాదించడంలో సహాయపడుతుందన్నారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందని, సమర్థవంతమైన నాయకత్వం బలమైన యాజమాన్యం కింద, యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎదిగిందన్నారు. పేషంట్ల అవసరాలకు అనుగుణంగా, అరుదైన క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ, యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ చికిత్సా సేవలను అందిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ మేనేజర్ రూపేష్ షిండే, మార్కెటింగ్ మేనేజర్ అమర్నాథ్ మూర్తి లు పాల్గొన్నారు.




# దివంగత సర్పంచ్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జరం పావని ఇటీవల జరిగిన అకాల మరణం పట్ల నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దివంగత సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేయడానికి ఫోరం ప్రతినిధులు తాళ్ల రాంపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నందిపేట్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, నందిపేట్ గ్రామ సర్పంచ్ ఎర్రం లింగం ఆధ్వర్యంలో దివంగత బెజ్జరం పావని కుటుంబానికి రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా నిలుస్తామని, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారు కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అయిలాపూర్ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉమ్మెడ సర్పంచ్ బొజేందర్, లక్కంపల్లి సర్పంచ్ సంతోష్ గౌడ్, బజార్ కొత్తూర్ సర్పంచ్ గోపు ముత్యం, సిద్ధాపూర్ సర్పంచ్ ఇర్ప మహేష్‌తో పాటు సీనియర్ నాయకులు ధర్మన్న (ఖుదావన్‌పూర్), రామకృష్ణ (ఆంధ్రనగర్), జంగిడి దేవీదాస్ (కొండూరు), నవీన్ (కౌల్‌పూర్), మురళి (చిమ్రాజ్‌పల్లి), సుధన్ (బద్గుణ) తదితరులు పాల్గొన్నారు. అనంతరం దివంగత బెజ్జరం పావని చిత్రపటానికి నివాళు లర్పించిన నాయకులు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, బెజ్జరం పావని గ్రామాభివృద్ధికి చేసిన సేవలు



చిరస్మరణీయమని కొనియాడారు.

# హమాలీలకు సమగ్ర చట్టం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.మల్లికార్జున్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : హమాలీ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర హమాలీ కార్మికుల చట్టం తీసుకురావడంతో పాటు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్ టీయూ జిల్లా అధ్యక్షుడు డి.మల్లికార్జున్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నిజామాబాద్ కార్మిక శాఖ కార్యాలయం (లేబర్ ఆఫీస్) ఎదుట తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు రోజురోజుకు ఉపాధి కోల్పోతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హమాలీల జీవనాధారం పూర్తిగా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపై ఆధారపడి ఉంటుందని, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడంతో గతంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు



లభించే సీజనల్ ఉపాధి ప్రస్తుతం నెల రోజులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు, గోదాముల్లో స్థానిక హమాలీ కార్మికులకు ఉపాధి కల్పించాల్సిన చోట గోదాం లేబర్ కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను అధిక సంఖ్యలో నియమిస్తూ స్థానిక కార్మికులను పనికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల శ్రమదోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులు, గోదాములు, పరిశ్రమల్లో స్థానిక హమాలీ కార్మికులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రతి కార్మికుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డు జారీ చేయాలని కోరారు. ఆ గుర్తింపు కార్డు ద్వారా అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు నెలకు రూ.10,000 పెన్షన్ మంజూరు చేయాలని, ప్రతి కార్మికుడికి గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు, ప్రభుత్వ గోదాముల్లో పనిచేసే హమాలీ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో కోల్డ్ స్టోర్స్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు గంగాధర్, లక్ష్మణ్, పసుపు డోల్ హమాలీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు పండరి, సీడ్ కంపెనీ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుశాంత్, విజిటబుల్ హోల్‌సేల్ మార్కెట్ ముల్లె హమాలీ యూనియన్ అధ్యక్షుడు మచ్చ మోహన్, యూనియన్ నాయకులు మల్లేష్, పీరయ్య, రాములు, అంజి, రిక్షా పుల్లర్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు, రైస్ హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి వకీల్, యూనియన్ నాయకులు అన్వర్, ముజామిల్, దాదు తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

## డాక్టర్ మహేష్ బాబు




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలు ఒకటో తరగతి నుంచి ఉన్నత విద్య వరకు చదువుతున్న వారం దరూ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (scholarships.gov.in) ద్వారా స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ మహేష్ బాబు, బీడీ కార్మిక వెల్ఫేర్ హాస్పిటల్ చీఫ్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీడీ వెల్ఫేర్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన బీడీ కార్మికుల పిల్లలందరూ సమీపంలోని ఆన్‌లైన్ సేవా కేంద్రాలను సంప్రదించి నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా 2026 ఆగస్టు 31లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ విద్యా సహాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ చదువును కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, వెల్ఫేర్ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఏడుగురిపై కేసు నమోదు




ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి అటవీ రేంజ్ పరిధిలోని ధర్పల్లి మండలం దుబ్బాక శివారులో గల డీబీ తండా సమీపంలో అటవీ శాఖ భూమిని అక్రమంగా చదును చేస్తున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ధర్పల్లి ఎస్సై సందీప్ తెలిపారు. అటవీ శాఖకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దుబ్బాక సెక్షన్ అధికారి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా, ఇద్దరు ట్రాక్టర్ల సహాయంతో అటవీ శాఖ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు ఇందల్వాయి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ తెలిపారు. ఈ క్రమంలో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నించగా, డీబీ తండాకు చెందిన భూక్య సిసిందర్, భూక్య గణేష్, భూక్య భిక్య, భూక్య సకరం, భూక్య వార్య, భూక్య శుక్య, భూక్య అనిల్‌లు అటవీ అధికారిపై దుర్భాషలాడుతూ, విధుల నిర్వహణకు ఆటంకం కలిగించి తోసివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వారు రెండు ట్రాక్టర్లతో అక్కడి నుంచి పరారైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఇందల్వాయి రేంజ్ అధికారి రవి మోహన్ బట్ ధర్పల్లి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేయగా, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన ఆరోపణలపై పై పేర్కొన్న ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ధర్పల్లి ఎస్సై సందీప్ వెల్లడించారు.

# పదోన్నతిపై బదిలీ అవుతున్న సైనిక సంక్షేమ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బదాం గంగా మోహన్ పదోన్నతితో మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి బదిలీ కావడంతో బుధవారం ఆయనకు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి బి. పవన్ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యాలయ సిబ్బంది, నిజామాబాద్ జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, కామారెడ్డి జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, అలాగే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మాజీ సైనికులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ బదాం గంగా మోహన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొంది మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా అదే అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. పవన్ కుమార్, సులేమాన్, ఉమర్, సుర హరప్రసాద్, సాయిరెడ్డి, గుజరాతీ మోహన్, థామస్, తుల రాములు, రాజేశం తదితరులతో పాటు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనిక వితంతువులు పాల్గొన్నారు.



## నేడే టీవీయువీ అకాడమిక్ ఎక్సెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవం

### టీవీయూవీ జిల్లా అధ్యక్షులు రాంపూర్ అజయ్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయూవీ) ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల సందర్భంగా "టీవీయూవీ అకాడమిక్ ఎక్సెన్స్ అవార్డ్స్" పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్య క్షులు రాంపూర్ అజయ్ తెలిపారు. విద్య, క్రీడలు, కళలు తదితర రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ కార్యక్ర మంలో అకాడమిక్ ఎక్సెన్స్ అవార్డు లతో సత్కరిం చనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పురస్కార ప్రదానోత్సవం ఆగస్టు 6వ తేదీన నిజామా బాద్‌లోని గిరిరాజ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడం, వారి విజయా లను గుర్తించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అజయ్ తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల నిధులపై ఆడిట్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశా లలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి మంజూరైన నిధుల విని యోగంపై బుధవారం ఆడిట్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన చార్టెడ్ అకౌంటెంట్స్ బృందం ఆదర్శ హిందీ విద్యాలయం పాఠశాలలో నిజామాబాద్ దక్షిణ, ఉత్తర మండలాలతో పాటు నిజామాబాద్ రూరల్, మోపాల్ మండలాలకు చెందిన సుమారు 150 ప్రభుత్వ పాఠశాలల నిధుల వివరాలను పరిశీలించింది. పాఠశాలలకు వివిధ పద్దుల కింద మంజూరైన నిధులు ఏ విధంగా ఖర్చు చేశారనే అంశాలను ఆడిటర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు సంబంధించిన నిధుల వినియోగ వివరాలు, రికార్డులను ఆడిట్ బృందానికి సమర్పించారు. ఆడిటర్లు జయప్రకాష్, ధనుష్, నరేం దర్‌లు క్యాష్ బుక్స్, వోచర్లు తదితర రికార్డులను పరిశీలించారు. ఆడిట్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పీఆర్టీయూ ఉత్తర, దక్షిణ మం డలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, జావిద్, అస్రార్ అహ్మద్, సాయికుమార్, ప్రవీణ్‌తో పాటు ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎబినై జర్ తదితరులు సహకారం అందించారు. నాలుగు మండలాల్లోని ప్రభు త్వ పాఠశాలలకు సంబంధించిన నిధుల ఆడిట్‌ను 100 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం సాధించాలి

### సర్పంచ్ భోగ నిత్యానంద్

మోర్తాడ్, బతుకమ్మ :రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని సర్పంచ్ భోగ నిత్యానంద్ ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో ఆగస్టు 7 నుంచి 9 వరకు జరగనున్న 72వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళా, పురుషుల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ఎంపికైన నిజామాబాద్ జిల్లా మహిళా జట్టుకు మోర్తాడ్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణ శిబిరాన్ని మోర్తాడ్ గ్రామ సర్పంచ్ భోగ నిత్యానంద్ సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడిన ఆయన మోర్తాడ్ బాలికల పాఠశాలలో జిల్లా జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడాకా రులకు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్న పాఠశాల ప్రధానో పాధ్యాయులు, బాలికల హాస్టల్ ఇన్‌చార్జ్ లకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యామ్, నిర్వహణ కార్యదర్శి నాగేష్, ఉపాధ్యాయులు రవీందర్, రవి, దీపిక తదితరులు పాల్గొన్నారు.



# నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు..

### జీజీహెచ్ లో మౌలిక వసతులపై మంత్రికి వినతి...

### ఆర్ వోబీ..ఆర్ యూబీ..నిర్మాణం, బస్ స్టాండ్ ఆధునికీకరణ కోసం మంత్రులను కలిశా...

### అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తన ప్రతి అడుగు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళు గడిచినా..నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ ర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెందిన వారికి నిధులు ఇస్తున్నారు తప్ప, ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో అనేక సార్లు ఆయా శాఖల మంత్రులను కలవడం జరిగిందని గుర్తు చేశారు. నగర అభివృద్ధి కోసం మళ్లీ నలుగురు మంత్రాన్ని కలవడం జరిగిందన్నారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ను కలిసి పలు అంశాలపై వినతి అందజేశానన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.100 కోట్లతో నాందేవాడ, దేవి రోడ్డు, రైల్వే స్టేషన్ అదనపు వంతెన నిర్మించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే రూ.70 కోట్లతో ఎల్లమ్మ గుట్ట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. అలాగే వర్ని, నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ కమ్మర్పల్లి వరకు నగరం మీదుగా 107 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనలు కూడా అందించినట్లు పేర్కొన్నారు. నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి వరకు రోడ్లు భవనాల రహదారి అభివృద్ధి కూడా అవసరమని వివరించినట్లు పేర్కొన్నారు. ఇందూరులోని టీ హబ్ ద్వారా యువతకు ప్రముఖ ఎంఎన్ సీ కంపెనీలు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కలిసినట్లు చెప్పారు. ఇందూరు యువతలో ప్రతిభకు కొదవలేదని, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. యువతను నగరాలకు పంపడం కాదని, ఉద్యోగాలను నిజామాబాద్ కే తీసుకురావాలని అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సమస్యలను సమగ్రంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిని కలిసి వివరించినట్లు తెలిపారు. ఎమ్మారై యంత్రం ఇప్పటికీ లేకపోవడం, మార్చురీ ఫ్రీజర్ల కొరత, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడం ప్రధాన సమస్యలన్నారు. అలాగే సివిల్ సర్జన్, ఆర్ ఎంఓ లు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. పేదల ప్రాణాలను కాపాడే ఆసుపత్రిలో సౌకర్యాల కొరత ఉండకూడదని, ప్రజల ఆరోగ్యం పై రాజీపడే పరిస్థితి ఎప్పుడు ఉండకూడదు అన్నారు. తెలంగాణలోని ప్రధాన నగరాల్లో ఒకటైన నిజామాబాదు బస్టాండులో పెరిగిన రద్దీకి తగిన సౌకర్యాలు లేకపోవడం శోచనీయమని అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి అందజేసినట్లు చెప్పారు. గతంలో స్థలానికి సంబంధించి వినతి పత్రం కూడా అందజేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్కు విశాలమైన వేచి ఉండే హాలు, సిట్టింగ్ కెపాసిటీ పెంపు, డిజిటల్ బస్సు ఇన్ఫర్మేషన్ బోర్డులు, ఎల్ఈడి స్క్రీన్లు, సీసీ




కెమెరాలు, పార్కింగ్ సదుపాయం పరిశుభ్రత వంటి అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో నిజామాబాద్ అభివృద్ధిని వేగవంతం చేయాలన్నదే తన ప్రయత్నమని అర్బన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందుకోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గారితో కలిసి రైల్వే శాఖకు సంబంధించిన అనేక ప్రతిపాదనలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు అందజేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, శ్యామల సత్యపాల్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, పసునూరి రాము, బట్టు రాఘవేందర్, ఎస్సీ మోర్చ నాయకులు జస్పాల్ సింగ్, బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి

### ఇన్ స్టెంట్ లాభాలను నమ్మవద్దు .....పోలీస్ కమిషనర్ సాయి చైతన్య






నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :డిజిటల్ యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయని, ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్, స్టాక్ ఇన్వెస్ట్ మెంట్ పేరిట జరుగుతున్న మోసాలు అధికమవుతున్నాయని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా -- సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల (వీఆర్ఈసి) లో సైబర్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "100 శాతం గ్యారంటీ రిటర్న్లు", "డైలీ ప్రాఫిట్", "ఇన్‌సైడర్ టిప్స్", "ప్రత్యేక పెట్టుబడి అవకాశాలు" వంటి తప్పుడు హామీలతో మోసగాళ్లు అమాయకులను ఆకర్షిస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా మొదట నకిలీ లాభాలను చూపించి, తర్వాత భారీ పెట్టుబడులు పెట్టించేలా ప్రలోభపెట్టి, చివరకు ప్రాసెసింగ్ ఫీజు, అప్‌గ్రేడేషన్ ఛార్జీలు తదితర పేర్లతో డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. అలాగే నకిలీ ఆర్థిక సలహాదారులు, కంపెనీ ప్రతినిధులుగా నటిస్తూ చట్టబద్ధ అనుమతులు లేని సంస్థల ద్వారా పెట్టుబడులు సేకరించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు పలు సూచనలు చేశారు. అధిక లాభాల పేరుతో వచ్చే ప్రతి పెట్టుబడి అవకాశాన్ని నమ్మవద్దని, పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా బ్రోకర్ అధికారికంగా నమోదు అయి ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ లేదా అపరిచితులు ఇచ్చే పెట్టుబడి సూచనలను విశ్వసించవద్దని, వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పెట్టుబడులకు ముందు కుటుంబ సభ్యులు లేదా అర్హత కలిగిన ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఆయన కోరారు. త్వరగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. తెలంగాణ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, సైబర్ నేరాల నియంత్రణ కోసం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అయితే ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని తెలిపారు. ప్రతి పౌరుడు "బి అలర్ట్ - బి అవేర్ - బి సేఫ్ " అనే సూత్రాన్ని పాటిస్తూ, "అప్రమత్తతే రక్షణ -- ధృవీకరణే భద్రత -- అవగాహనే ఆయుధం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, పోలీసు అధికారులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి సైబర్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ బి. ప్రకాష్ యాదవ్, నిజామాబాద్ రూరల్ (నార్త్) సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మొఖీద్ పాషా, మాక్లూర్ ఎస్ఐ అనిల్ కుమార్, సైబర్ క్రైమ్ ఎస్ఐలు రవి కుమార్, ప్రవాళిక, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ గణేష్, సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ రూరల్‌ను కాంగ్రెస్‌కు శాశ్వత కంచుకోటగా మారుస్తాం

## రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి






నిజామాబాద్ రూరల్, బతుకమ్మ :కాంగ్రెస్ పార్టీని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో శాశ్వత కంచుకోటగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పిలుపునిచ్చారు. ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం మండల అధ్యక్షుడు చింతల కిషన్ అధ్యక్షతన నిర్వహించగా, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల పార్టీ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఎమ్మెల్యే విస్తృతంగా మాట్లాడారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఎదగడానికి నాయకులు, కార్యకర్తల కృషే ప్రధాన కారణమని అన్నారు. రాజకీయంగా చైతన్యవంతమైన ఇందల్వాయి మండలంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కష్టానికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి, కర్నా మోహన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. వారి సేవలను స్మరించుకుంటూ సమావేశంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. నేను డాక్టర్ కాబట్టి సున్నితంగా ఉంటానని అనుకోవద్దు.. మంచివారికి మంచివాడిని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారి పక్షాన ఎప్పుడూ నిలబడతానని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ పోరాడుతోందని, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెంచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. పార్టీ నాయకులందరూ అన్నదమ్ముల్లా ఐక్యంగా పనిచేస్తే మరిన్ని విజయాలు సాధించవచ్చని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ, బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు నెలకొన్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయాల కంటే పూజలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సేవ చేయడమే రాజకీయ నాయకుల ప్రధాన బాధ్యత అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఆరోపించిన ఎమ్మెల్యే, ఆ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీఆర్ఎస్ నాయకులే ఆరోపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా ఎమ్మెల్యే విమర్శలు చేశారు. దేశ భవిష్యత్, యువత అవసరాలపై కేంద్రం సరైన దృష్టి పెట్టడం లేదని అన్నారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు కనిపిస్తున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ ఆస్తులను విక్రయిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసే చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కార్యకర్తలు మరింత చైతన్యంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్ గౌడ్, బాల్ రాజు, పొలసాని శ్రీనివాస్, వెంకట్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ఇందల్వాయి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు పాల్గొన్నారు.

# చట్టపరమైన విజ్ఞానం పాఠశాల నుండే మొదలు కావాలి

## ఇంచార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరీష






నిజామాబాద్ లీగల్, బతుకమ్మ పిల్లల పట్ల చెడు దృక్పథం కలిగి ఉన్న, చెడు పనులు చేసినవారు చట్టం ముందు తలవాల్చక తప్పదని, చట్టపరమైన విజ్ఞానం బడి నుండే మొదలు కావాలని ఇంచార్జీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరీష తెలిపారు. జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ నల్సా ఆదేశాల మేరకు నల్సా రూపకల్పన చేసిన పిల్లల కోసం స్నేహపూర్వక న్యాయసేవలు -పథకం 2024 లో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతున్నదని ఇంచార్జీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయసేవ సదన్ లో నిర్వహించిన సదస్సును ఆమె సహచర అదనపు జిల్లాజడ్జిలు సుగాలి నారాయణ, ధారావత్ దుర్గా ప్రసాద్, క్షత్రి ఉషా కిరణ్, అదనపు జిల్లా కలెక్టర్ వి. భుజంగ రావు,నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు, న్యాయసేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సాయి సుధ, జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్, నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (సిసిఎస్ ) శ్రీశైలం లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. తల్లితండ్రులకు చెప్పని విషయాలు ఉపాధ్యాయులకు చెబుతారని చెప్పిన విషయాలను విశ్లేశించుకుని మంచిచెడును తెలియజేయాలని అన్నారు. పద్దెనిమిది సంవత్సరాల పిల్లలపై లైంగిక దాడులను అరికట్టడానికి అమలులో ఉన్న పోక్సో చట్టం మగ ఆడ పిల్లలకు ఇద్దరికి వర్తిస్తుందని తెలిపారు. కొన్ని సందర్భాలలో మగ పిల్లలు లైంగిక దాడికి గురయ్యే ప్రమాదం ఉన్నదని అన్నారు."కాదేది కవిత కు అనర్హం" అన్నట్లు పిల్లలపై లైంగిక దాడులు ఎవరు చేసిన ఆఖరికి స్వంత బంధువులు చేసిన పోక్సో చట్టం వర్తిస్తుందని జడ్జి హరీష తెలిపారు. పాఠశాలలలో విద్యార్థులకు లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం -2012 షార్ట్ కట్ లో పోక్సో చట్టం గూర్చి అవగాహన కల్పించాలని కోరారు.చిన్న ఆరోపణ వచ్చిన బాలికలను బడికి దూరం చేస్తారని ఆ విదంగా చేయడం వారి విద్యా హక్కును కాలరాచివేయడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల హక్కులు, రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని బయపడాల్సిన పని లేదని ఆమె పేర్కొన్నారు."బేటీ బచావో, బేటి పడావో "అనే నినాదంను నిజం చేస్తూ ముందడుగులు వేయాలని, చట్టాలు చుట్టాలై మనతో కలిసి నడుస్తాయని సెషన్స్ జడ్జి హరీష అన్నారు. నిజామాబాద్ అదనపు జిల్లా కలెక్టర్ వి. భుజంగ రావు ప్రసంగిస్తు ఉన్నతమైన కార్యక్రమం తీసుకున్న జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ నల్సా విద్యార్థులకు మొగ్గలోనే ఎంతో న్యాయ విజ్ఞానాన్ని అందజేస్తోందని అన్నారు. బాలబాలికలకు సమాన హక్కులు ఉన్నాయని చట్టం ముందు అందరు సమానమేనని న్యాయ సూత్రాన్ని తెలియజేయడం అసమానతల తగ్గుదలకి కారణం కాగలుగుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.పిల్లలకు దక్కాల్సిన హక్కులు వారికి దక్కనివ్వాలని అన్నారు.పిల్లల ఎదుగుదలకు పాఠశాల ఉత్తమ వనరు అని తెలుపుతు వంద శాతం పిల్లలను పాఠశాల వైపు మల్లించాలని తెలిపారు. డ్రగ్స్ అనేది ఒక పెద్ద సమస్యగా మారిందని దానికి దూరంగా విద్యార్థులు ఉండే విదంగా ఉపాధ్యాయలోకం కృషి చేయాలని కోరారు.విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గదర్శకులుగా నిలవాలని అదనపు జిల్లాజడ్జిలు సుగాలి నారాయణ, దారావత్ దుర్గా ప్రసాద్, క్షత్రి ఉషా కిరణ్ లు అన్నారు. చట్టాల గూర్చి ఉపాధ్యాయులు తెలుసుకుంటే వాటి విలువను విద్యార్థులకు తెలియజేసిన వారు కాగలరని వారు తెలిపారు.జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల గురువులుగా గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంటుందని న్యాయసేవ సంస్థలో విన్న చట్టపరమైన విషయాలు తిరిగి విద్యార్థులకే తెలియజేయాలని అన్నారు.న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర విద్య శాఖ మధ్య న్యాయ విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే అవగాహన ఒప్పందం కుదిరిందని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నీలకంఠ రావు విద్యార్థుల విద్యభద్రతలో ఉపాధ్యాయుల పాత్ర ఉన్నట్లు సమాజంలో వారి భద్రత పౌర సమాజమే చూడాలని అన్నారు. నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (సిసిఎస్ ) శ్రీశైలం మాట్లాడుతూ పిల్లల భద్రతకు పోలీసు శాఖ పెద్దపీఠ వేస్తున్నదని అన్నారు.

పిల్లలపై జరిగిన నేరాలలో నేర విచారణలో అజాగ్రతకు వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.కార్యక్రమానికి సమన్వయ కర్తగా న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సాయి సుధ వ్యవహారించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు పాముజుల శ్రీనివాస్ రావు, వడ్డి హరి కుమార్, కీర్తి రాజ్,న్యాయసేవ సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్ కుమార్ సుబేధార్, జిల్లా ముఖ్య పరిపాలన అధికారి గోవింద్ రావు, న్యాయవాదులు మాణిక్ రాజు, ఆశ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భిక్కనూరు లో రైతులకు కష్టాలు

## 14 మోటార్ కేబుళ్ల చోరీ



భిక్కనూరు, బతుకమ్మ :భిక్కనూరు మండలంలోని రామేశ్వర్ పల్లి శివారులో సామల రాజిరెడ్డి బావి నుంచి ఏనుగు భూపతి బావి వరకు గల సుమారు 2 కిలోమీటర్ల మేర వ్యవసాయ పంపుసెట్ల వద్ద గుర్తు తెలియని దుండగులు 14 మోటార్ కేబుళ్లను బుధవారం చోరీ చేసి పరారయ్యారు. రాత్రి సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దుండగులు కేబుళ్లను కటర్‌తో తెగకొట్టి కాల్చి రాగి తీగల తీసుకువెళ్లారు. తెల్లవారుజామున పొలాలకు వెళ్లిన రైతులు మోటార్లు ఆగిపోవడంతో గమనించి చూడగా కేబుళ్లు తెగిపడి ఉన్నాయి. ఒక్కొక్క కేబుల్ విలువ సుమారు 8 వేల నుంచి 10 వేల వరకు ఉండటంతో మొత్తం రూ.1 లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపారు.ఈ చోరీ కారణంగా సుమారు 30 ఎకరాల్లోని వరి, మొక్కజొన్న పంటలకు సాగునీరు అందక ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంఘటనపై బాధిత రైతులు భిక్కనూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అనిల్ తెలిపారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రాత్రి సమయంలో గస్తీని పెంచాలని, దొంగలను వెంటనే పట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



# చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా దేశ అభివృద్ధికి తోడ్పడాలి

## బాల్కొండ ఎస్సై శైలేందర్



బాల్కొండ, బతుకమ్మ :విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా విద్యార్థి దశ నుంచే మంచి మార్గంలో ఉంటూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని బాల్కొండ ఎస్సై శైలేందర్ అన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎక్కువగా ఉన్నందున చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండాలని ఆయన కోరారు. బాల్కొండ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో బుధవారం మన ఊరు మన భద్రత మన బాధ్యత అనే కార్యకమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసైతే జీవితాలు చిత్తవుతాయి

## ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి



మెండోరా, బతుకమ్మ :విద్యార్థులు మత్తుకు బానిసైతే జీవితాలు చిత్తవుతాయని, ఉన్నత లక్ష్యం ఏర్పాటు చేసుకొని లక్ష్యాన్ని సాధించాలని ఏ సీ పీ వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మెండోరా మండలంలోని పోచంపాడ్ లో గల రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో బుధవారం ఆర్మూర్ ఏ.సీ.పీ సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ క్రైమ్ జరిగే విధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెండోరా ఎస్సై సుహాసిని, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనం బోనాలు



వేల్పూర్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాలు నిదర్శనమని నిజామాబాద్ జిల్లా టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు బతుల మాణిక్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి పండుగ యొక్క సాంప్రదాయాలు విలువలు తెలియాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని, ఫలితంగా ప్రతి ఒక్కరు పండుగల పై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. కన్నుల పండుగగా బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెన్న మురళి, లక్ష్మి, సరళ, వరలక్ష్మి, సునీత, వివో ఏ మురళీ మోహన్, ఆపరేటర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరిలో ప్రతిభ దాగి ఉంటుంది

### సర్పంచ్ పెగడ విజయ్ కుమార్



మోర్తాడ్, బతుకమ్మ :గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ప్రతి ఒక్కరిలో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, సరైన క్రమంలో తర్ఫీదు పొంది మెలకువలు నేర్చుకున్నట్లయితే ప్రతి క్రీడా కారుడికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గ్రామ సర్పంచ్ పెగడ విజయకుమార్ అన్నారు. మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామంలో గల యువ క్రీడాకారులకు బుధవారం క్రికెట్ కిట్లను ఆయన అందజేశారు. క్రీడాకారులకు క్రీడల విషయంలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయిరాం, యువ క్రీడాకారులు నర్సారెడ్డి, మధు, నవీన్, బన్నీ, రవితేజ, నందు తదితరులు పాల్గొన్నారు.

## శెట్ పల్లీ అంగన్ వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వార్షికోత్సవాలు



మోర్తాడ్, బతుకమ్మ :మోర్తాడ్ మండలం శెట్ పల్లీ గ్రామంలో అంగన్ వాడీ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎన్ఎం సద్గుణ మాట్లాడుతూ గర్భిణి స్త్రీలు బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు. ముర్రుపాలు పిల్లలకు జీవితాంతం వ్యాధి నిరోధక శక్తిగా పనిచేస్తుందని, అందుకే ఆరు నెలల వరకు తల్లిపాలు కొనసాగించాలని తెలిపారు. అలాగే గ్రామంలో లబ్ధిదారులందరు ప్రతినెల పిల్లల యొక్క బరువులు, ఎత్తులు తీయించుకొని పిల్లల పోషణ స్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్ సుమలత మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్ కు వచ్చి గర్భిణీ స్త్రీలు రోజు ఒక పూట సంపూర్ణ భోజనం అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# జి.జి. కళాశాల దోస్త్ ప్రవేశాల్లో మిగిలిన ఖాళీలు 66

### ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.రామ్ మోహన్ రెడ్డి




నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : జి.జి. కళాశాలకు కేటాయించబడిన 1860 సీట్లకు గాను, బుధవారం నాటికి 1794 మంది విద్యార్థులు తుది ప్రవేశం పొందారని, కేవలం 66 ఖాళీలు మాత్రమే మిగిలియాని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. రామ్ మోహన్ రెడ్డి తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఇప్పటివరకు వివిధ కోర్సులలో మిగిలిన ఖాళీల వివరాలు ప్రిన్సిపాల్ తెలియజేశారు. బి.ఏ. 09, ఉపాధి ఆధారిత (ఏఈడీపీ) కోర్సులు బీకాం విభాగంలో బీ.ఎఫ్.ఎస్.ఐ. 02, సైన్స్ విభాగంలో హెల్త్ కేర్ మేనేజ్ మెంట్ 08, డిజిటల్ ఎలక్ట్రానిక్స్ కోర్సుల్లో 03, ఈ మూడు (ఏఈడీపీ) కోర్సుల్లో మొత్తం 180 సీట్లకు గాను 13 ఖాళీలు మిగిలాయని, బి.కాం.లో ఫినాన్స్ 01, టాక్సేషన్ 02, అనాలైటిక్స్ 04, బి.బి.ఏ. 02, మొత్తం 480 కి గాను 09 ఖాళీలు మిగిలాయని తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్స్ లో 21, ఫిజికల్ సైన్స్ 10, హానర్స్ 04, మొత్తం బీఎస్సిలో 720 గాను 35 ఖాళీలు మిగిలాయని, బుధవారం నాటికి 1794 మంది విద్యార్థులు తుది ప్రవేశం పూర్తి పొందారని తెలిపారు. ఆగస్టు 6 నుండి మొదలయ్యే స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్ కోసం దోస్త్ లో ఖాళీల వివరాలను బట్టి విద్యార్థులు అప్లై చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్ రంగరత్నం, అడ్మిషన్ కన్వీనర్లు రమేష్ గౌడ్, రామస్వామి, దండు స్వామి, వినయ్ కుమార్, రంజిత, ఉమాకిరణ్, జయ ప్రసాద్, నహీదా బేగం, రాజేశ్, రామక్రిష్ణ, కిరణ్ కుమార్ గౌడ్, అధ్యాపకులు,సాంకేతిక సహాయకులు శ్రీకాంత్, నాగరాజు, మొబినొద్దీన్, గంగాధర్, విజయ, వివేకానంద, రాము, నరేష్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం

### తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు

### టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరిగేలా త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీష్ రావుపై స్పందిస్తూ.. తాను చేతబడి చేస్తున్నారని ఎప్పుడూ అనలేదని, అయితే కొన్ని ఆలయాల్లో ఆయన ఎలాంటి పూజలు నిర్వహించారో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ రైస్ మిల్లులకు సంబంధించిన పెండింగ్ బకాయిల వసూళ్లపై కేబినెట్లో తీర్మానం చేశామని తెలిపారు. రైస్ మిల్లుల అక్రమాల విషయంలో తప్పు చేసిన వారు ఏ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే అక్రమాలపై కేసులు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆర్బీ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాజెక్టుల పనుల్లో జాప్యం జరుగుతోందని, ప్రజలు సహకరించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనలను పట్టించుకోకుండా గతంలో పనులు చేపట్టడం కేవలం కమిషన్ల కోసమేనని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డ్యామ్ సేఫ్టీ అధికారుల సూచనల మేరకే ప్రాజెక్టు పనులు చేపడుతోందని స్పష్టం చేశారు. బీహార్ బంకీపూర్‌లో జరిగిన ఓటమి ప్రధాని మోదీ పతనానికి నాంది అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేటీఆర్ చేపట్టే పాదయాత్ర వల్ల బీఆర్ఎస్‌కు ఎలాంటి ప్రయోజనం ఉండదని, ఆ పార్టీపై ప్రజలకు నమ్మకం లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం సీట్లు సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్ రెడ్డి, నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉమారాణి, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కల్కి చెరువు అలుగు వద్ద బారికేడ్లు ఏర్పాటు

### ప్రజల భద్రతే లక్ష్యమని మున్సిపల్ అధికారులు

### అలుగు ప్రాంతానికి దూరంగా ఉండాలని

### ప్రజలకు సూచన



బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని కల్కి చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా అలుగు ప్రాంతంలో మున్సిపల్ అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. చెరువును తిలకించేందుకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు అలుగు ప్రాంతానికి వెళ్లకుండా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ గోవు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కాసుల రోహిత్ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులో నీటి ప్రవాహం గణనీయంగా పెరిగిందని, ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలుగు ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొని బారికేడ్ల ఏర్పాటును పరిశీలించి, ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం ముగిసే వరకు చెరువుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

## సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర

భిక్కనూరు, బతుకమ్మ :సైబర్ నేరాలపై ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో మోసం చేస్తున్నారని, తెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే ఓటీపీ, సీవీవీ, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పవద్దని, ఆన్‌లైన్ లోన్ యాప్స్, ఉద్యోగాల పేరుతో వచ్చే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా అనుమానం ఉంటే వెంటనే 1930 కు డయల్ చేయాలని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా వాడాలని, మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రాణాలు పోతున్నాయని, వేగంగా వెళ్లడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, ట్రాఫిక్ సిగ్నల్స్ ను గౌరవించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సు ద్వారా యువత, ప్రజలు సైబర్ మోసాల పట్ల, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నరేష్, ఎస్సై అనిల్, కామారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, సర్పంచ్ బల్యాల రేఖ, మండల సర్పంచ్లు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కాంగ్రెస్ నేతల ఆరోపణలు అవాస్తవం


## ఏర్గట్ల గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి

ఏర్గట్ల, బతుకమ్మ :మెండోర మండలంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చేసిన ఆరోపణలను ఏర్గట్ల గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో 80 శాతం పనులు గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో ఏర్గట్ల మండల కేంద్రానికి 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయని, కేవలం 20 శాతం పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. గత రెండున్నర సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. నిర్మాణాలు పూర్తికాకుండా వదిలేయడం వల్ల ఇళ్లు నిరుపయోగంగా మారి అపరిశుభ్రతకు గురయ్యాయని అన్నారు. ఈ పరిస్థితిని సునీల్ కుమార్ గుర్తించాలని విమర్శించారు. బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉంటూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్న సునీల్ కుమార్, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పూర్తికి నిధులు ఎందుకు తీసుకురాలేకపోయారో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్లలో బాల్కొండ నియోజకవర్గానికి, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ఎంత మేర నిధులు కేటాయించారో వెల్లడించాలని కోరారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి



ప్రజలకు తెలుసని వారు పేర్కొన్నారు. ఇకపై కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇన్ని రోజులుగా వినియోగంలో లేకపోవడంతో దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతుల ఖర్చును కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించాలని ఏర్గట్ల గ్రామ ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, ఏర్గట్ల మాజీ జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, ఏర్గట్ల గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవుడు నరసయ్య, మండల పార్టీ నాయకులు, గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోచంపాడు మృతుల కుటుంబాలను పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :పోచంపాడు ప్రాజెక్టులో నీట మునిగి మృతి చెందిన కలీం, అజీమ్, వజహత్ కుటుంబాలను టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆయన, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి, వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ ఉమారాణి, స్టేట్ మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇర్ఫాన్ అలీ, కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, తాహేర్ బిన్ అహ్మదాన్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, దయాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ బెల్లాలా పోతన్నకు టీపీసీసీ అధ్యక్షుడి నివాళులు



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :నిజామాబాద్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ బెల్లాలా పోతన్న పార్థివ దేహానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నివాళు లర్పించారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పోతన్న భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. అనంతరం పోతన్న కుటుంబ సభ్యులను పరామర్శించిన మహేష్ కుమార్ గౌడ్, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బెల్లాలా పోతన్న సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు శేఖర్ గౌడ్, కేశ వేణు, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, దయాకర్ గౌడ్ తదితరులు పాల్గొని బెల్లాలా పోతన్నకు నివాళులర్పించారు.



## దోమలపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి

### పట్టణంలో ఫాగింగ్ ముమ్మరం
### డెంగ్యూ, మలేరియా నివారణకు చర్యలు




బాన్సువాడ, బతుకమ్మ :బాన్సువాడ పట్టణంలో దోమల బెడద పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఫాగింగ్ చేశారు. వర్షాల కారణంగా నిల్వ నీరు పెరగడంతో దోమలు విపరీతంగా వ్యాపించే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యగా ఫాగింగ్ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ గోవు గంగాధర్ తెలిపారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

## షెట్ పల్లీ పీహెచ్సీని సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ఓ

మోర్తాడ్ బతుకమ్మ :మోర్తాడ్ మండలం షెట్ పల్లీ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డిప్యూటీ డిఎంహెచ్వో రవీందర్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్లను, సిబ్బంది హాజరు రిజిస్టర్లను, గదులను, మందులను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులకు ప్రజలు కురికాకుండా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సద్గుణ, దీప, యం ఎల్ హెచ్ పీ లావణ్య, ఆశా వర్కర్లు సరిత, లత తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల కేంద్రంలో బుధవారం మాజీ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పర్యటించి పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సోమ రాజారెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు సోమ గంగారెడ్డి తండ్రి సోమ చిన్న గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న మానాల మోహన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన గుండు కార్తీక్ తండ్రి గంగాధర్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి వెంట మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## విష గుళికలు తిని జాతీయ పక్షి మృతి



ఏర్గట్ల, బతుకమ్మ :ఏర్గట్ల మండల పరిధిలోని తోర్తి గ్రామంలో జాతీయ పక్షి నెమలి విష గుళికలు తిని మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన నెమలిని పరిశీలించారు. అనంతరం పశువైద్య అధికారి నెమలికి పోస్టుమార్టం నిర్వహించారు. అటవీ శాఖ నిబంధనల ప్రకారం జేసీబీ సహాయంతో గుంత తవ్వించి నెమలి కళేబరాన్ని ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాహుల్, జీపీఓ భూమన్న, ఫారెస్ట్ ఆఫీసర్ వరుణ్‌తో పాటు సంబంధిత శాఖల సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. నెమలి మృతికి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు. విష గుళికల వల్లే నెమలి మృతి చెందిందా లేదా అనే అంశంపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.

## తల్లి పాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో కీలకం

### గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి



ఏర్గట్ల, బతుకమ్మ :తల్లిపాలు శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతో కీలకమని గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఏర్గట్ల మండల పరిధిలోని అంగ న్వాడీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజ రై తల్లిపాల ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన గంటలోపే ము ర్రుపాలు పట్టించడం ఎంతో అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఐసీడ ఎస్ సూపర్వైజర్ గంగ హంస మాట్లాడుతూ, ముర్రుపాలు శిశువుకు జీవి తాంతం వ్యాధి నిరోధక శక్తిని అందిస్తాయని వివరించారు. ఆరు నెలల తర్వాత శిశువుకు అనుబంధ పోషకాహారం అందించడం ప్రారంభిం చాలని సూచించారు. ప్రతి నెలా పిల్లల బరువు, ఎత్తు కొలిచి వారి పోష కాహార స్థితిని పర్యవేక్షించాలని మహిళలకు సూచించారు. అంగన్వాడీ సిబ్బంది మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి ప్రతిరోజూ అందించే సంపూర్ణ భోజనాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. పిల్లల బరువును ప్రతి నెల తప్పనిసరిగా తూకం వేయిం చాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సూచించిన మేర కు పిల్లలకు నిర్ణీత సమయంలో అన్ని టీకాలు వేయించడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సున్నపు లక్ష్మి శ్రీనివాస్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు చంద్రకళ, శోభ, సుజాత, ఏర్గట్ల గ్రామ మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.